క్లుప్తంగా

ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

దుమ్ముగూడెం: భద్రాచలం నుంచి వయా ఆర్లగూడెం మీదుగా లక్ష్మీనగరం వరకు ఆర్టీసీ సర్వీసులను సోమవారం లక్ష్మీనగరంలో ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం భద్రాచలం నుంచి తునికిచెరువు, రామచంద్రునిపేట, చెరుపల్లి, మారాయిగూడెం, ఆర్లగూడెం మీదుగా లక్ష్మీనగరం వరకు ప్రతిరోజూ ఉదయం 8.30కు.. మరలా లక్ష్మీనగరం నుంచి భద్రాచలానికి ఉదయం 10గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. భద్రాచలం నుంచి సాయంత్రం 5గంటలకు బయలుదేరి లక్ష్మీనగరం 6.15కు చేరుకుని తిరిగి 6.30కు లక్ష్మీనగరం నుంచి బయలుదేరి భద్రాచలం వెళుతుంది. ప్రారంభ కార్యక్రమంలో లక్ష్మీనగరం ఉప సర్పంచ్ గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, ఆదివాసీ సంఘం నాయకుడు సొందె వీరయ్య, ఆర్టీసీ సిబ్బంది యంవి.రావు, కిరణ్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు భద్రాచలం పట్టణ ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ పీవీఎస్ రావు ఆధ్వర్యంలో సోమవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సైతో పాటు ట్రాఫిక్ పోలీసులు ప్రస్తుత సమాజంలో బ్యాంకు ఎకౌంట్లో మోసపోతున్న విధానాన్ని వివరించారు.

పీఆర్‌సీని ప్రకటించాలి

మణుగూరురూరల్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన నల్లబ్యాడ్జీలతో నిరసన సోమవారం మూడో రోజుకు చేరుకుంది. నాయకులు నరేష్, వి.ప్రసాద్, బి.హేమ్లా నాయక్, ప్రేమ్‌కుమార్, వీరస్వామి, సాయి, దయాకర్, రమ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వాగొడ్డుగూడెం గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ సాధు జోత్స్నబాయి ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట కార్మికులను సూచించారు. అనంతరం గ్రామంలో వీధి లైట్లను వేయించి, వాటి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

'జారే' పర్యటన

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల, రామక్కబంజర్ గ్రామాల్లో సోమవారం ఉదయం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు జారే ఆదినారాయణ పర్యటించారు. నియోజకవర్గంలో ఆయన ఇటీవల కాలంగా చేపట్టిన హలో శుభోదయం కార్యక్రమంలో భాగంగా రెండుగ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, సొసైటీ చైర్మన్ చందర్‌రావు, కిరణ్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

భూమిపూజ..

ములకలపల్లి: మండలకేంద్రంలోని పెద్ద బజారులో సీసీరోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ టీబినేని వీరభద్రం, ఎంపీటీసీ శనగపాటి మెహరమణి సోమవారం భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రూ.5 లక్షల సీడీపీ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఉపసర్పంచ్ శనగపాటి అంజన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పువ్వాల మంగపతి, పుష్పాల చందర్‌రావు, శనగపాటి సీతారాములు, రవి, పుష్పాల సాయి పాల్గొన్నారు.

పోడు పట్టాలివ్వాలి

చండ్రుగొండ: గిరిజనులతోపాటు గిరిజనేతర పేదలకు పోడుపట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. నాయకులు ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటాచారి, జీ రామారావు, జి.తిరుమలరావు, సర్పంచ్ కాక సీత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండల పరిధిలోని కూనవరం గ్రామానికి చెందిన ఏనిక నరసింహరావు అనారోగ్యంతో మరణించగా.. రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రూ.5వేలను దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ అట్టం లక్ష్మణ్‌రావు, బూర్గంపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సకిని బాబురావు, బర్ల సురేష్, ఏనిక రాము, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, కామరాజు, ముత్తయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్చి1న ఇఫ్టూ మహాసభ

గుండాల: గుండాల మండలం ఏరియా మూడో మహాసభ మార్చి1న గుండాల మండల కేంద్రంలో జరగనున్న ఐఎఫ్‌టీయూ ఏరియా మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు వై.వెంకన్న కోరారు. సోమవారం గుండాల మండల కేంద్రంలో హమాలీ వర్కర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడ్డం నగేష్, చీమల సుధాకర్‌లు పాల్గొన్నారు.

భవనాల వెతలకు చెక్

- పంచాయతీలకు కొత్త భవనాలపై కసరత్తు
- 18 భవనాల నిర్మాణాలకు రూ.3.60 కోట్లు మంజూరు
- 'ఉపాధి హామీ' నిధులతో నిర్మాణాలు



ఆరోగ్య ఉప కేంద్రంలో కొనసాగుతున్న బోదనెల్లి పంచాయతీ కార్యాలయం

చర్ల: పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేక పాలకులు, అధికారులు పడుతున్న కష్టాలు ఇక తీరనున్నాయి. సొంత భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, గ్రంథాలయ భవనాలు, అద్దె భవనాలలో అరకొర వసతులతో పంచాయతీల కార్యకలాపాలను కొనసాగిస్తున్న గ్రామపంచాయతీలకు సొంత భవనాలు మంజూరు అయ్యాయి. మండలంలో 18 గ్రామ పంచాయితీలో కార్యాలయ భవనాల నిర్మాణాల కోసం ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున 18 భవనాల నిర్మాణానికి రూ.3.60 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో ఆయా గ్రామ పంచాయితీలలో శాస్వత భవనాల నిర్మాణాల కోసం అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కొత్త పంచాయతీలకు 12 భవనాలు..

చర్ల మండలంలోని నాలుగేళ్ల క్రితం వరకు 14 గ్రామ పంచాయతీలు ఉండగా, పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణా రాష్ట్రం ప్రభుత్వం పంచాయితీల విభజన చేయడంతో అదనంగా మరో 12 పంచాయతీలు ఏర్పడ్డాయి. 14 పాత పంచాయితీలకు ఉన్న కార్యాలయ భవనాలలో 6 శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆ భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత పంచాయతీ కార్యాలయాలకు 6 భవనాలు, కొత్త పంచాయతీలకు 12 భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. మండలంలో మొత్తం 18 పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాల కోసం రూ 3.60 కోట్లను నిధులు విడుదల చేస్తున్నట్లు గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నిధులతో గొమ్ముగూడెం, కుదునూరు, కుర్నపల్లి, పూసుగుప్ప, సత్యనారాయణపురం, సుబ్బంపేట, బోదనెల్లి, సీ కత్తిగూడెం, చిన మిడిసిలేరు, గొంపల్లి, కలివేరు, కేశవాపురం, కొత్తపల్లి, కొయ్యూరు, లక్ష్మీకాలనీ, లింగాపురం, పులిగుండాల, తిప్పాపురం గ్రామపంచాయితీలలో భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి.

నాలుగేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటైన 12 గ్రామపంచాయతీల కార్యాకలాపాలను ఆయా గ్రామపంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, గ్రంథాలయ భవనాలలతో పాటు అద్దె భవనాలలో కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ భవనాలలో సరైన వసతి లేకపోవడం, ఇరుకిరుకుగా ఉండడంతో ఇటు పాలకులు, అటు అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూనే పాలన సాగిస్తూ వస్తున్నారు. గ్రామసభలు, ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకునేందుకు అనువుగా లేకపోవడంతో రోడ్లపైన, చెట్ల క్రింద నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ క్రమంలో నూతనంగా ఏర్పాటయిన 12 గ్రామపంచాయతీలతో పాటు శిథిలావస్థలో ఉన్న 6 పంచాయతీల కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మండలంలో పంచాయతీ పాలకులు, అధికారులు, ప్రజలు పడుతున్న కష్టాలు తీరనున్నాయి.

సంతోషాన్ని కలిగిస్తోంది..



నాలుగేళ్ల క్రితం నూతనంగా ఏర్పాటయిన పులిగుండాల గ్రామపంచాయతీకి భవనం లేకపోవడంతో గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో ఒక గదిని తీసుకుని అందులో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నాం. కానీ పంచాయతీకి సంబంధిచిన రికార్డులు, సామగ్రి, యంత్ర పరికరాలను భద్రపరచేందుకు ఇబ్బందిగా ఉంది. నూతన భవనం మంజూరుకావడం సంతోషంగా ఉంది.

– సోడి చలపతి, సర్పంచ్, పులిగుండాల

భయం భయంగా విధులు నిర్వహించాం..



కుదునూరు గ్రామపంచాయితీలో సుమారు 30 యేళ్ల క్రింత నిర్మించిన పంచాయతీ కార్యలయ భవనం పూర్తిగా శిథిలమైంది. ఈ నేపథ్యంలో భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. దీనికితోడు చిన్నపాటి వర్షానికే గదుల్లో కురుస్తుంది. రికార్డులు, సామగ్రి తడిచిపోతున్నాయి. ఈ క్రమంగా నూతన భవనానికి నిధులు మంజూరుకావడం ఆనందంగా ఉంది.

– కె దివ్య, పంచాయతీ కార్యదర్శి, కుదునూరు

పనులు త్వరలోనే ప్రారంభిస్తాం..



చర్ల మండలంలో 18 గ్రామ పంచాయతీలో కార్యాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క భవనానికి రూ.20 లక్షల చొప్పున 18 భవనాల నిర్మాణాల కోసం రూ.3.60 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు ప్రారంభించనున్నాం. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తాం.

– బి.వశ్యానాయక్, పంచాయతీరాజ్ ఏఈ

బంజారాల సంక్షేమానికి కృషి



మహాభోగ్ బండారాలో విప్ రేగా కాంతారావు


మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బంజారాల సంక్షేమానికి కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ శేషగిరినగర్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ 284 జయంతి వేడుకలకు ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంత్ సేవాలాల్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి మహాభోగ్ బండారాలో పాల్గొని అగ్నిదేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లతో పాటు అన్నింటిలో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గిరిజనులకు రెసిడెన్షియల్ పాఠశాలలు, హైదరాబాద్‌లో సేవాలాల్ బంజారా భవన్ నిర్మాణం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, బంజారా సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో ఖైతి లంబాడాలతో పాటు 11 బీసీ కులాలను ఎస్టీ తెగలలో కలిపే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భద్రాచలం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లాలని కోరుతూ పీఓ గౌతమ్ పోట్రుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వట్టం కన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ధనసరి రాంమ్మూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పూనెం బాలకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పూనెం శ్రీను, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు వర్స శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వర్సా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం మణుగూరు మండలంలోని కొమరంభీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పీఓకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పడిగ నారాయణ, కల్తీ ప్రవీణ్‌కుమార్, గుండి శరత్‌కుమార్, పూనెం బాలకృష్ణ, సుతారి కన్నయ్య, సుతారి నాగేశ్వరరావు, వట్టం నారాయణమూర్తి, వెంకటేష్, శ్రీను, ప్రనీత్, సాయికుమార్, గోపాల్, జంపయ్య, రామకృష్ణలు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మార్చి నెల 5 వ తారీఖు నుంచి 10వ తారీకు వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సోమవారం ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజ చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఆలయానికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయంలో నెలకొన్న సమస్యలను మేనేజర్ రమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఒడ్డుగూడెం గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దిరెడ్డిగూడెం పంచాయతీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.అయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బుడేన్, సర్పంచ్ బోడా పద్మ, ఉప సర్పంచ్ పర్సావెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, నాయకులు పాల్గొన్నారు.

తిప్పనపల్లిని అభివృద్ధి పథంలో నడిపిస్తాం..

చండ్రుగొండ: తిప్పనపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సీసీరోడ్ల నిర్మాణాల కోసం మంజూరైన రూ.15 లక్షల పనులకు సోమవారం ఎమ్మెల్యే మెచ్చా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మొత్తంలో సీసీరోడ్ల నిర్మాణం చేయించే బాధ్యత తనదేనన్నారు. అప్పటికప్పుడు మరో రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఇప్పటి వరకు గ్రామానికే రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ దారావత్ పార్వతి, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, ఉపసర్పంచ్ రామారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, ఉప్పతల ఏడుకొండలు, గాదే శివప్రసాద్, భూపతి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటివెలుగు అధికారి తనిఖీ

మణుగూరురూరల్: మణుగూరులోని బాలాజీనగర్‌లో ఎస్టీ బాలికల హాస్టల్‌లో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆ పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ పర్షియా నాయక్ సోమవారం సందర్శించారు. శిబిరంలో ప్రజలకు చేస్తున్న కంటివైద్య పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాల పైబడిన వారందరినీ కంటివెలుగు శిబిరాలకు తరలించాలని సూచించారు. డాక్టర్ దినేష్, వైద్యసిబ్బంది రాంప్రసాద్, దివ్య, అనసూయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీలోని కట్టంవారిగూడెం, చింతిర్యాల యువతకు రేగా విష్ణుచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వాలీబాల్ కిట్లను బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, ఎంపీటీసీ ఏనిక రవి పంపిణీ చేశారు. చింతిర్యాల సర్పంచ్ కల్లూరి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ కొండా బాబురావు, మాజీ సర్పంచ్ కుర్సం రామారావు, వార్డు సభ్యుడు నాగేంద్ర బాబు, లక్ష్మీనారాయణ, తాటి నరేష్, అశోక్, కట్టం నరసింహారావు పాల్గొన్నారు.

దారి చూపండి..

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేద్కర్‌నగర్ పరిధిలో ఉన్న శ్మశానవాటికకు దారి చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం సంఘటన స్థలంలో నిరసన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంటుందని, పంట పొలాల గెట్లపై నుంచి పాడె మోయడం కష్టతరంగా మారిందని కుక్కముడి లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని వేసవికాలంలోనే శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని అంబేత్కర్‌నగర్ వాసులు కోరుతున్నారు.

దాడులు ఆపాలి

మణుగూరుటౌన్: పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలపై అధికారపార్టీ నేతల దాడులు, దౌర్జన్యాలు ఆపాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలెం కోటీలు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక గిరిజనుల మీద అధికారపార్టీ నేతలు ఇష్టానుసారంగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రావు, విన్సెంట్ పాల్గొన్నారు.

పనికి భద్రత కల్పించండి

బూర్గంపాడు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనికి భద్రత కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మోతె గ్రామంలో సోమవారం ఉపాధిహామీ కూలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఎస్‌కె.అబీదా, పద్మ, లక్ష్మి, సీతమ్మ, విజయ, సంధ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి నీలిమ

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యూడీషియల్ న్యాయమూర్తి శ్రీమతి ఎం.నీలిమ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎం.నీలిమ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. న్యాయవాదులు పామరాజు తిరుమలరావు, పేరాల నాగరాజు బాల్య వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిరోధక చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం మొదలైన చట్టాల గురించి గ్రామస్తులు, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ దోమల రమేష్, కొత్తపల్లి సర్పంచ్ గుండి వెంకటేశ్వర్లు,మండల్ లీగల్ సర్వీసెస్ సభ్యులు ఉబ్బాసీ రమేష్, ప్రవళిక, కోర్టు సిబ్బంది ఏ.సత్యనారాయణ, గ్రామస్తులు ముర్రం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరు నష్టదాయకం

మణుగూరుటౌన్: విధులకు గైర్హాజరవడం నష్టదాయకమని సింగరేణి ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్‌రమేష్ అన్నారు. సోమవారం మణుగూరు ఏరియాలోని కనీసం వంద మస్టర్స్ చేయకుండా గైర్హజరవుతున్న కార్మిక కుటుంబాలతో కలిసి వారికి ఉద్యోగం విలువ దాని ప్రాధాన్యతతోపాటు సంస్థ మనుగడకు సంబంధించిన విషయాలపై చర్చించారు. గైర్హజరైన ఉద్యోగుల ఆరోగ్య ఆర్థిక, కుటుంబ పరిస్థితి, గైర్హాజరుకు గల కారణాల గురించి కమిటీ వివరంగా తెలుసుకుంది. గైర్హాజరు వల్ల నష్టాలను వివరించి, మరోమారు కారణం లేకుండా విధులకు దూరమైతే కంపెనీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గైర్హాజరైన కార్మికులతోపాటు ఎంఎన్‌జీ గని మేనేజర్ రాజేశ్వరరావు, సీనియర్ పీఓ రామేశ్వరరావు, పీబీ అవినాష్‌లు పాల్గొన్నారు.

గురుకులంలో డిజిటల్ మేళా



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఐటీసీ అధికారులు

భద్రాచలంఅర్బన్: ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఏపీ ఐటీసీ సహాయ సహకారంతో భద్రాచలం, బూర్గంపహాడ్లలో ఇరవై ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ విద్యను ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇరవై ప్రభుత్వ పాఠశాల పిల్లలు కంప్యూటర్ ద్వారా చేసిన ప్రాజెక్ట్‌ను డిజిటల్ మేళా తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రదర్శించారు. దీనిని పరిశీలించడానికి ఐటీసీ అధికారులు వచ్చి ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి సర్టిఫికెట్స్ బహూకరించి అభినందించారు. ఐటీసీ ఎంఎస్‌కె మేనేజర్ జయప్రకాష్ పిల్లలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ రాజ్, ఐటీసీఎమ్ఎస్‌కె ప్రాజెక్ట్ మేనేజర్ జయప్రకాష్, ఐటీసీ ఎమ్ఎస్‌కె ప్రాజెక్ట్ అధికారి కష్ణ కాశ్యప్, ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ నిర్వహణ అధికారి లోకరాజు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నవీన్, పాఠశాల ప్రిన్సిపల్ దేవదాస్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ నీరజ, హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ టీమ్ అలీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీలోని కుమ్మరిగూడెం గ్రామంలో క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని గ్రామస్తులు, యువకులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కుమ్మరిగూడెంలో రాజీవ్‌సాగర్‌లో సేకరించిన 2 ఎకరాల భూమిని తహసీల్దార్ సురేష్ 2022లో గ్రామస్తుల క్రీడా మైదానం కోసం పంచాయతీకి అప్పగించారు. రూ.30 వేల ఖర్చుతో గ్రామ పంచాయతీ భూమి చదును చేయగా.. ఓ రైతు భూమి తనదని అనడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు క్రీడా మైదానంలో పనులు ఆపారు. ప్రత్యేక చొరవ తీసుకొని క్రీడా మైదానం సమస్య పరిష్కరించి అభివృద్ధి చేయాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు.

ధైర్యంగా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహమాన్

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థినులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సోమవారం విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థినులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణతో కలిగిన చదువును కొనసాగించాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ వసంతకుమార్, ఎస్సై షాహిన, విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి మృతి

అశ్వాపురం: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలం నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, ఆర్ఎంపీ సీతరాంపురం గ్రామానికి చెందిన చంద్రగిరి అప్పారావు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో నియోజకవర్గంలో తెలంగాణ నినాదాన్ని ఎత్తుకున్న అప్పారావు సకలజనుల సమ్మె, రైలు రోకో, ఎన్నో పోరాటాలు, ఆందోళనలు, ధర్నాలలో ప్రత్యేక పాత్ర వహించారు. అశ్వాపురం మండలం నుంచి టీఆర్ఎస్ పార్టీ జెండా పట్టిన మొదటి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సీతరాంపురం గ్రామంలోని నివాసంలో అప్పారావు మృతదేహంపై ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పోరాట యోధుడు కృష్ణయ్య

చండ్రుగొండ: ఈ ప్రాంత సమస్యలపై అలుపెరుగని యోధుడిగా సూర కృష్ణయ్య పోరాటాలు చేశారని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన కృష్ణయ్య సంస్మరణ సభ సోమవారం జరిగింది. కృష్ణయ్య చిత్రపటం ఎదుట నివాళులు అర్పించిన నామ.. అనంతరం సభలో మాట్లాడుతూ కృష్ణయ్య సేవలను శ్లాఘించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సతీష్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో ఆయన వెంట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, టీఆర్ఎస్ నాయకులు దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, ఎస్డీ రసూల్, గాదె శివప్రసాద్, సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి



అశ్వాపురం: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మణుగూరుటౌన్: డాక్టర్ ప్రీతి చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని జాతీయ వినియోగదారుల అండ్ మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మండడి సంజీవరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు గత ఐదు సంవత్సరాల్లో 119మంది మెడికోలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సీనియర్లు జూనియర్స్‌కు మార్గదర్శకంగా ఉండేలా చూడాలి కాని వారి ప్రాణాలు తీసే విధంగా ఉండకూడదన్నారు.

అశ్వాపురం: మెడికో విద్యార్థి ప్రీతి మృతికి కారణమైన కారకులను శిక్షించాలని కోరుతూ.. మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో, మండల కేంద్రంలో సోమవారం రాత్రి కాలనీ మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడ్య కేశవరావు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ములకలపల్లి: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ ఎండి.ఉస్మాన్‌ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని జగన్నాథపురంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉజ్వల భవిష్యత్ ఉన్న ప్రీతి అర్ధాంతంగా తనువు చాలించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

దుమ్ముగూడెం: డాక్టర్ ప్రీతి బలవన్మరణానికి కారకుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ మండల జనరల్ సెక్రటరీ, అధ్యక్షుడు బి.రవి, ఓ.జోగారావులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కే రేగుబల్లి ఆశ్రమ పాఠశాలలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాలల్లో ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ఉపాధ్యక్షురాలు మంజుల, ఉపాధ్యాయులు జయ, సుజాత, నాగేశ్వరావు, వార్డెన్ శాలిని తదితరులు పాల్గొన్నారు.